ముసునూరులో 3 కరోనా కేసులు



ప్రజాశక్తి - ముసునూరు
మండలంలో మూడు కరోనా కేసులు నమోదయ్యాయి. మండల కేంద్రమైన ముసునూరు పిహెచ్‌సి వైద్యులు కిరణ్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఉండగా ముసునూరులో ఒకటి, చింతలవల్లిలో రెండు కరోనా కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కేసుల నమోదు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కంగారు పడకుండా అందరూ తప్పనిసరిగా మాస్కు, శానిటైజర్, వ్యక్తిగత దూరం, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు.

కాలనీలపై కలవరం..!

జెడ్‌పి సమావేశంలో ఇళ్లస్థలాల సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులు ఏకరువు
లేఅవుట్‌ల్లో పూడిక, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలపై ఆవేదన
కోర్టులో ఉన్న స్థలాల సమస్యపై అసంతృప్తి
ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలి: కలెక్టర్
పలు తీర్మానాలను ప్రవేశపెట్టిన జెడ్‌పి ఛైర్మన్ కవురు
తూతూమంత్రంగా సాగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశం
కవురుకు అధికారులు, ప్రజాప్రతినిధుల వీడ్కోలు,శుభాకాంక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
జగనన్న కాలనీల్లో నెలకొన్న ఇళ్లస్థలాల పూడిక, రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు వంటి సమస్యలను పరిష్కరించాలని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగిన ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు ఏకరువు పెట్టారు. 60, 70 శాతం ఇళ్లు పూర్తయిన కాలనీల్లోనూ రోడ్లు, డ్రెయిన్ల సమస్యలు పరిష్కరించలేదన్నారు. పట్టాలిచ్చి కోర్టులో ఉన్న స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే లబ్దిదారుల నుంచి తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 43 లేఅవుట్ల పూడిక ఇప్పటికీ జరగలేదన్నారు. అనంతరం ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు తదితర పనుల నాణ్యతను పరిశీలించేందుకు జెడ్‌పిటిసి, ఎంపిపి, తహశీల్దారు, ఎంపిడిఒలతో కూడిన బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును, అంగన్వాడీలను పరిశీలించాలని సూచించారు. ఇటువంటి తనిఖీలు నిర్వహిస్తే పనుల్లో మంచి ప్రగతి కన్పించడమే కాకుండా క్షేత్రస్థాయిలో సిబ్బందిలో కొద్ది భయం ఉంటుందని చెప్పారు. కనీసం నెలకు రెండుసార్లు ఈ బృందం తనిఖీలు చేపట్టాలన్నారు. స్పందనలో వచ్చిన ప్రజా సమస్యల పరిష్కారం బాగా జరుగుతుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం చేపడుతున్న సందర్భంలో స్పందనలో పరిష్కార తీరులో అసంతృప్తి ఉంటే తెలియజేయవచ్చని, పరిశీలన అనంతరం సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని తెలిపారు. స్పందనలో ఎక్కువగా 25 శాతం వ్యక్తిగత భూసమస్యలు వస్తున్నాయని వివరించారు. ఇటువంటి సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దల ద్వారా పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. రబీ ధాన్యం సేకరణకు సంబంధించి ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయన్నారు. ఎకరాకు 92 గోనె సంచులు అందిస్తున్నామని, పంటకోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా వేసి ఇది నిర్ణయించామని తెలిపారు. వంద సంచులు ఇవ్వాలని డిమాండ్ ఉందని, అయితే రైతులు తమ చేతిలో ఉన్నపంటను ముందుగా ఇచ్చేలా అవగాహనపర్చాలన్నారు. గోనె సంచుల సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రవాణా సౌకర్యానికి సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం అందిస్తే రబీ ధాన్యం సేకరణ సజావుగా పూర్తి చేసేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తామన్నారు. గత ఖరీఫ్‌లో 21 రోజులకే సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని ప్రతి మండలంలో కనీసం 4,5 చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒలు, తహశీల్దార్లకు సూచించామన్నారు. ఉపాధి హామీ కింద పలు ప్రభుత్వ ప్రాధాన్యతా నిర్మాణాలు చేపట్టామని, కొన్ని భవనాలు 95 శాతం నిర్మాణ పనులు పూర్తిచేసుకొని తుదిదశలో ఉన్నాయని, వాటిని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధుల చొరవ ఎంతైనా అవసరమన్నారు. జిల్లాలో రీసర్వేపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. భూమి వివరాల్లో వ్యత్యాసాలు ఉంటే గ్రామ సభలో తెలియపర్చవచ్చని, రికార్డులో పేరు తప్పు పడితే 21 రోజుల్లో అభ్యంతరాలు తెలిపే అవకాశం ఉందని అన్నారు. గృహనిర్మాణానికి సంబంధించి జిల్లాలో ప్రగతి బాగానే ఉందన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల కాలనీల్లో అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా పనులు జరుగుతున్నాయన్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులను ఇళ్ల నిర్మాణ అనంతరం వేగంగా చేపడుతున్నట్లు తెలిపారు.


జెడ్‌పి ఛైర్మన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్

పలు తీర్మానాలు ఆమోదం

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పలు తీర్మానాలను పెట్టి సభ ఆమోదం కోరారు. జిల్లా పరిషత్ సిబ్బందికి సంబంధించి ఉద్యోగులను, కుటుంబాలను ఆదుకునేందుకు జెడ్‌పి సాధారణ నిధుల నుండి వార్షికంగా రూ.15 లక్షలు ఇన్సూరెన్స్ సొమ్మును కంపెనీకి చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. జెడ్‌పి కార్యాలయం నుండి గ్రామ పంచాయతీ పింఛనుదారులు 230 మందికి, జెడ్‌పి పింఛనుదారులు 26 మందికి వెరసి మొత్తం 256 మందికి పింఛను చెల్లిస్తున్నట్లు ఈ ఆర్థిక సంవత్సరం నుండి పింఛను చెల్లింపు నిమిత్తం రూ. ఆరు కోట్లు బడ్జెట్ జెడ్‌పి సాధారణ నిధుల కేటాయించనున్నట్లు తెలిపారు. ఎరియర్ సొమ్ము ప్రభుత్వం నుండి విడుదలయ్యాక పింఛనుదారులకు సొమ్ము చెల్లించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. తాను జెడ్‌పి ఛైర్మన్‌గా ఉన్న సమయంలో అన్నివిధాలా ఆదరించి ముందుకు నడిపించిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు కవురు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే నా చివరి సమావేశం అని పేర్కొన్నారు. ఏ జిల్లాలో చేయనివిధంగా ప్రతి జెడ్‌పిటిసికి అభివృద్ధి పనులకు రూ.కోటి కేటాయించినట్లు వివరించారు. ఎంఎల్‌సిలు జయమంగళ వెంకటరమణ, షేక్ సాబ్జీ, గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పలు సమస్యలను లేవనెత్తారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, పలువురు జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు. ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను శాలువాతో అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు.

జెడ్‌పి అధికారుల రూటే వేరు..

జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఉండాల్సిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహణాతీరును జెడ్‌పి అధికారులు అందుకు విరుద్ధంగా మార్చేశారు. ఏదో సమావేశం పెట్టాలనే రీతిలో తూతుమంత్రంగా నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. ఎజెండా అంశాలకు సంబంధించిన కాపీలను సభ్యులకు అందించడం పూర్తిగా వదిలేశారు. గతంలో పుస్తకం రూపంలో ఎజెండా అంశాలు, వివరాలు పొందుపరిచి సభ్యులకు, మీడియాకు ఇచ్చేవారు. గడిచిన రెండు, మూడు సమావేశం నుంచి దీనికి పూర్తిగా తిలోదకాలు ఇచ్చారు. పథకాలకు సంబంధించిన సమాచారం తెలియకుండానే ఈ విధంగా చేస్తున్నారా అనే అనుమానాలు నెలకొన్నాయి. వారు చెప్పిందే ఎజెండా అన్నట్లు తయారైంది. ఎజెండాలో పేర్కొన్న ఒకటి, రెండు అంశాలకే సభ పరిమితమవుతోంది. గతంలో జెడ్‌పి సమావేశానికి మంత్రులు, ఎంఎల్ఎలంతా హాజరయ్యేవారు. గత కొన్ని సమావేశాలనుంచి మంత్రులు, ఎంఎల్ఎలు కనీసం రావడం లేదు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి కలెక్టర్‌గాని, జెసిగానీ రాకపోవడంపై సభ్యులుసైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన పరిస్థితి ఉంది. గురువారం సమావేశానికి గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, ఎంఎల్‌సిలు షేక్ సాబ్జీ, జయమంగళ వెంకటరమణ మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనం అనంతరం సమావేశం జరుగుతుండగా, సమస్యలపై చర్చలు ఉంటాయని చెప్పడంతో సభ్యులంతా వచ్చి ఆశీనులయ్యారు. అయితే సమావేశం జరగలేదు. కనీసం సభ్యులకు సమాచారం కూడా ఇవ్వకపోవడంపై అంతా అసహనం వ్యక్తం చేశారు. జెడ్‌పి సమావేశం తీరుతెన్నులను పూర్తిగా మార్చేస్తున్న జెడ్‌పి అధికారుల తీరు సభ్యుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

చేపలు పడుతున్న పేదలు, దళితులు

దోసపాడు భూపోరాటం మరింత ఉధృతం

మూడో రోజు చేపలు పట్టి నిరసన తెలిపిన దళితులు, పేదలు
అధికారులు నిర్లక్ష్యం వీడాలి: ఏపి వ్యకాస నేత పి.రామకృష్ణ

ప్రజాశక్తి - దెందులూరు
దోసపాడు దళితుల పట్ల జిల్లా అధికారులు నిర్లక్ష్యం వీడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. తమకు చెందిన అసైన్డ్, సీలింగ్, గయాళ భూముల కోసం పేదలు గత 10 నెలల నుండి పోరాడుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ దళితులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం చేపల చెరువులో దిగి చేపలు పట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భూములు పంచాలని గత 10 నెలల నుంచి పోరాడుతున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. అసైన్డ్ భూముల ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కుమ్మక్కై పేదలకు, దళితులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూపోరాట నాయకులు ఆనందరావు, బేబీ, కుమారి, గంగాధర్, దివాకర్, పవన్, వెంకటరమణ, తెరేజమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.



మేడే పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

మేడే స్ఫూర్తితో కార్మిక చట్టాల అమలుకు పోరు

ప్రపంచ కార్మిక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు
ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీప్రభుత్వం అత్యంత సంపన్నుల కోసం మార్పులు చేయడం సిగ్గుచేటని, కార్మికచట్టాలను మేడే స్ఫూర్తితో పటిష్టంగా అమలు చేసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, భారత రాజ్యాంగం, లౌకికవాదం, ఫెడరలిజం, మత సామరస్యం అంటే ఏంమాత్రం ఇష్టంలేని బిజెపి దేశంలో మతోన్మాదాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఒకశాతం పెట్టుబడిదారుల కోసం దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టడం దుర్మార్గమన్నారు. కార్మికవర్గానికి రక్షణగా ఉన్న 44 చట్టాలను కార్పొరేట్ల కోసం నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారన్నారు. మోడీ పాలనలో నిరుద్యోగం రోజురోజుకి పెరుగుతుందన్నారు. రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసిన బిజెపితో మన రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన అంటకాగుతున్నాయన్నారు. మేడే స్ఫూర్తితో బిజెపి నుంచి దేశాన్ని, ప్రజానీకాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మేడే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 27 మండలాల్లో అన్ని పట్టణాల్లో మేడే పతాకావిష్కరణలు, ప్రదర్శన, సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులోకం పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నేతలు బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, జి.రాజు, ఎం.నాగమణి, కె.వెంకట్రావు, ఎస్.రాంబాబు, ఆర్‌విఎస్.నారాయణ, ఎస్‌కె.సుభాషిణి, వి.సాయిబాబా పాల్గొన్నారు.

చిరిగిన గోనెలు చూపుతున్న రైతులు

రైతులకు నాణ్యమైన గోనె సంచులివ్వాలి

పోతునూరులో రైతుల నిరసన

దెందులూరు: ధాన్యం కొనుగోలుకు రైతులకు నాణ్యమైన గోనె సంచులు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు పోతునూరులో గురువారం నిరసన తెలిపారు. రైతులు చినిగిన గోనె సంచులు పట్టుకుని ఈ సంచుల్లో ధాన్యం నింపేదెలాగని నినదించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఇచ్చే గోనె సంచులలో 40 శాతం చినిగినవి ఉండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నాణ్యమైన గోనె సంచులు ఇవ్వాలని కోరారు. ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలన్నారు. నూక శాతం పేరుతో రైతుల నుండి డబ్బు వసూలు ఆపాలని కోరారు. ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యతో ఆర్థిక భరోసా

మండవల్లి: అనాథ బాలలు సన్మార్గంలో ఉంటూ విద్యలో రాణించే విధంగా ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఆర్థిక భరోసాను కలిగిస్తుందని చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ డైరెక్టర్ జె.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం మిషన్ వాత్సల్య పథకంపై కైకలూరు ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయి నిరాధారణకు, నిస్సహాయతకు గురవుతున్న బాలబాలికలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి నెలకు రూ.నాలుగు వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లేశ్వరి, సిడిపిఒ ఆనంద్‌బాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి పాల్గొన్నారు.

నెక్లెస్ బండ్‌ను పటిష్టంగా నిర్మించాలి

పోలవరం: నెక్లెస్ బండ్ పటిష్టంగా నిర్మించాలని, ప్రజానీకం రాకపోకలు సాగించడానికి ర్యాంప్‌లు ఏర్పాటు చేయాలని పాత పోలవరం గ్రామస్తులు గురువారం డిమాండ్ చేశారు. టిడిపి మండల ఇన్‌ఛార్జి, మాజీ ఉప సర్పంచి మంగిన కొండ, బిజెపి నాయకులు గ్రంధి బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పెదరామాలయం వద్ద మత్స్యకారులు, రజకులు, గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ, బాలకృష్ణ మాట్లాడుతూ గోదావరి వరద ముంపు నుంచి పోలవరం గ్రామానికి రక్షణగా నిర్మించిన నెక్లెస్ బండ్ డ్రెయినేజీ వ్యవస్థ లేక గ్రామంలో మురుగునీరు బయటకు పోవడానికి దారిలేక వరదలు, వర్షాల సమయంలో గ్రామం జలమయమవుతుందన్నారు.నెక్లెస్ బండ్‌కు నాలుగు చోట్ల కల్వర్టులు, 30 అడుగుల తారు రోడ్డు, గట్టుకు ఇరుపక్కల రివిట్‌మెంట్ చేయాలని సంకల్పించారని కానీ నేటికీ అమలు కాలేదన్నారు. స్థానిక ప్రజానీకం గోదావరి నదిలో స్నానాలకు, తాగునీరు తెచ్చుకోవడానికి, బట్టలు ఉతుక్కోవడానికి, పశువుల దాహార్తికి, దహన సంస్కారాలు, పిండ ప్రధానాలకు అవస్థలు పడుతున్నారన్నారు. మత్స్యకారులు, రజకులు తమ వృత్తులను నిర్వహించుకోవడానికి అవస్థలు పడుతున్నారని తెలిపారు. గతంలో నెక్లెస్ బండ్‌కు ర్యాంపులు ఉండేవని, మండల పరిషత్ నిధులతో రేవులలో నిర్మించిన ర్యాంపులు వరద మట్టిలో కూరుకుపోయాయని, వాటిని పునరుద్ధరించాలని కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి - బిజెపిని గద్దె దించాల్సిందే - సిపిఎం, సిపిఐ ప్రచార భేరిలో నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
ప్రజల సంపదను కొల్లగొట్టి అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సిపిఎం, సిపిఐ ప్రచార భేరి యాత్ర ముగింపు సందర్భంగా స్థానిక పాత పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సభకు సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, సిపిఐ మండల కార్యదర్శి రమణరాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మనవ కృష్ణచైతన్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రజల సంపదను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసారని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలన్నీ అంబానీ, అదానీలకు కట్టబెట్టడం కోసం పేదలపై పన్ను భారాలు వేసి లక్షల కోట్లు పన్ను రాయితీలు కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ధరలు తగ్గించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వానికి మద్దతు కోసం పోటీ పడుతున్నారని, వీరికి మోడీ భజన తప్ప పేదల బాగోగులు పట్టడం లేదని విమర్శించారు. ఇకనైనా ఈ మూడు పార్టీలు నోరు విప్పి కేంద్రం నుండి రాష్ట్రానికి రావలసిన నిధులు, హామీల అమలు కోసం వామపక్షాలతో కలిసి పోరాటాలకు మద్దతు తెలపాలని కోరారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో రైతులను, కార్మికులను, వ్యవసాయ కూలీలను ఐక్యం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సభలో సిపిఎం నేతలు అందుగుల ప్రభాకర్, జోడి సూర్యచంద్రరావు, జి.సూర్యకిరణ్, ఆర్.దుర్గారావు, వై.సీత, బి.రాంబాబు, పి.సూర్యారావు, సిహెచ్.మాణిక్యాలరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిత సురేష్, తోర్లపాటి బాబు, చాకిరి సురేష్, ఎ.సూర్యచంద్ర, సుంకర రాధాకృష్ణ, చిట్టూరి వెంకటేశ్వరరావు, కె.శ్రీరాములు పాల్గొన్నారు.

పెదవేగి : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం దెందులూరు నియోజకవర్గంలో కేంద్రంలో మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన చేపట్టిన ప్రచార భేరి యాత్ర రెండో రోజు ముండూరు, లక్ష్మీపురం, వేగివాడ గ్రామాల మీదుగా సాగింది. ముండూరులో ఆరబెట్టిన మొక్కజొన్న పంటను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతుల పంటలకు మద్దతు ధర కల్పిస్తూ మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించవద్దని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత ఎ.శ్యామలారాణి, సిపిఐ నేత పొటేలు పెంటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

పెదవేగి మండలంలో..

దెందులూరు : రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను మోడీకి తాకట్టుపెట్టి కేంద్ర ప్రభుత్వం ముందు మోకరిల్లి వైసిపి, టిడిపి, జనసేన కేంద్రంతో దోస్తీ చేస్తూ రాష్ట్రంలో కుస్తీలు పడుతున్నాయని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ విమర్శించారు. ప్రచార భేరి యాత్ర సోమవరప్పాడులో ప్రారంభించారు. గోపన్నపాలెం, గాలాయగూడెం, నాగుల దేవునిపాడు, గంగన్నగూడెం, మేదినరావుపాలెం, రామారావుగూడెం, శ్రీరామవరం, దెందులూరు, పోతునూరు, దోసపాడు, కొవ్వలి గ్రామాల మీదుగా యాత్ర సాగింది.
ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కోరారు.

ముసునూరు : బిజెపి స్వార్థ రాజకీయాలను తిప్పికొట్టాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా అన్నారు. సిపిఎం, సిపిఐ ప్రచార భేరి మండలంలో సాగింది. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు పి.జమలయ్య, నేతలు బత్తుల వెంకటేశ్వరరావు, పిల్లి మురళీ, చాట్ల పుల్లారావు, కొల్లి శ్రీను, ఓరుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించడం లేదని సచివాలయానికి తాళాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం
సచివాలయ భవన నిర్మాణ బిల్లులు చెల్లించాలని అదే గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి సచివాలయానికి తాళాలు వేసిన ఘటన మండలంలోని పేరంపేటలో గురువారం చోటుచేసుకుంది. దీంతో సచివాలయ సిబ్బంది బయటే ఉండిపోయారు. సచివాలయ భవన నిర్మాణానికి సంబంధించి ఆయనకు మరో రూ.20 లక్షల వరకూ బిల్లు మంజూరు కావాల్సి ఉందని, అవి విడుదల కాకపోవడంతో అసంతృప్తి చెందిన శ్రీనివాసరెడ్డి సచివాలయానికి తాళాలు వేసినట్లు సమాచారం. దీంతో ఎంపిడిఒ కిషోర్, తహశీల్దార్ స్లీవజోజి హుటాహుటిన పేరంపేట సచివాలయానికి తరలి వెళ్లారు. శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడి సచివాలయ తాళాలు తెరిచారు. ప్రజలకు అందించే సేవలను నిలుపుదల చేయడం సరికాదని నచ్చచెప్పారు. దీనిపై పంచాయతీరాజ్ ఎఇ సురేష్‌ను వివరణ కోరగా సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు అంచనా వేసినట్లు తెలిపారు. ఇప్పటికే కాంట్రాక్టర్ చేసిన పనులకు రూ.25 లక్షల వరకూ బిల్లులు చెల్లించామని తెలిపారు. మరికొన్ని పనులు చేయాల్సి ఉందని తెలిపారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉన్నప్పుడే సచివాలయంలో సేవలు ప్రారంభించడం వల్ల చిన్నచిన్న పనులు జరగలేదని తెలిపారు. భవనాన్ని ఖాళీ చేసి అప్పగిస్తే ఆ పనులు పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే పేరంపేటలో కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు అధికారి పార్టీ నుండి ఎంపిటిసి అభ్యర్థిగా గెలుపొందారు. గ్రామ సర్పంచిగా టిడిపి అభ్యర్థి గెలుపొందడం వల్ల ఇరుగ్రూపుల మధ్య మనస్పర్థలు వచ్చి ఇలాంటి ఘటనలకు దారితీస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా పేరంపేట గ్రామంలో సచివాలయానికి తాళాలు వేయడం సమంజసం కాదని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయానికి తాళాలు వేస్తున్న కాంట్రాక్టర్

పేదల ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు కోరుతూ నిరసన

జంగారెడ్డిగూడెం: పేదల ఇళ్లు కూల్చిన రెవెన్యూ సిబ్బందిపై, అధికారులపై చర్యలు తీసుకోవాలని, దళిత మహిళలపై దాడి చేసిన భూస్వాములపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. మండలంలోని నాగులగూడెంలో దళితుల ఇళ్లను తొలగించడంలో అత్యుత్సాహం కనబరచిన రెవెన్యు సిబ్బందిపై, అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మాదాసు ఆనందరావు అధ్యక్షత వహించారు. సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ 20 ఏళ్లుగా గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం భూస్వాములతో కుమ్మక్కై పేదల ఇళ్లను కూల్చేందుకు సిద్ధమవ్వడం దుర్మార్గమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గుర్వాయిగూడెం గ్రామ శివారు నాగులగూడెం పంచాయతీ సర్వేనెంబర్ 439, 440లో రెండు ఎకరాల భూమిని భూస్వాములు ఆక్రమించుకున్నారని, ఆ భూమిని పేదలకు పంచాలని అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా న్యాయం చేయని రెవెన్యూ అధికారులు భూస్వాములతో కుమ్మక్కై గ్రామంలో ఉన్న దళితుల ఇళ్లను కూల్చేందుకు సిద్ధమవుతున్నారా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి అధికారులకు చిత్త శుద్ధి ఉంటే భూస్వాముల ఆక్రమించుకున్న భూములపై సమగ్ర సర్వే జరిపి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పోర్జరీ డాక్యుమెంట్స్ ఆధారంగా మాదిగ సామాజిక తరగతికి చెందిన పేదల ఇళ్లను కూల్చేందుకు వచ్చిన గాది రామకృష్ణారెడ్డి, బిల్లా రామిరెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాగులగూడెంలో 32 మంది పేద కుటుంబాలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిట్ట నాగరాజు, ఎం.పెద్దకుమారి, అన్నపూర్ణ, పావని, పద్మ, రాజు, టి.రమణ, సిహెచ్.నాగరత్నం, ఎం.చిన్నకుమారి, పి.రాంబాబు, అందుగుల ప్రభాకర్‌రావు, పి.దుర్గారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించలేని గ్రామసభలెందుకు

సమస్యలపై ప్రజాప్రతినిధులను, అధికారులను నిలదీసిన ప్రజలు

ప్రజాశక్తి - మండవల్లి

'గ్రామంలో సమస్యలను పరిష్కరించేలా అధి, కారులను హాజరు పరచలేనప్పుడు గ్రామ సభలు నిర్వహించడం ఎందుకు' అంటూ సర్పంచిని, కార్యదర్శిని గ్రామస్తులు నిలదీశారు. మండవల్లి గ్రామసభ స్థానిక నాగేంద్రస్వామి ఆలయంలో సర్పంచి మెండ రూన్సీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సభ ప్రారంభం నుండి గ్రామస్తులు పలు సమస్యలపై గ్రామసభలో అధికారులను నిలదీశారు. ఎస్సి శ్మశాన వాటికకు ప్రహరీ, గేటు నిర్మిస్తామని చెప్పారని, కానీ నేటికీ ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. కుళాయిల మరమ్మతుల సమస్యల్లో నీరిని తీసుకువెళ్లే విధంగా మెట్టపై ఉన్న మట్టిని తొలగించాలని కోరినప్పటికీ పట్టించుకోలేదని, గ్రామంలో మురుగునీరు నిరంతరం రోడ్లపైకి చేరుతుందని డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నప్పటికీ నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీశారు. మురుగునీరు వల్ల దోమలవ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతుంటే కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదని సర్పంచిపై ధ్వజమెత్తారు. ఇందిరమ్మ లబ్దిదారులకు ఇచ్చిన స్థలం 17 సంవత్సరాలుగా మెరక చేయకుండా వదిలేశారని, దీంతో లోతట్టు ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకోలేక, నేటికీ అద్దె ఇళ్లల్లో ఉంటూ నానావస్థలు పడుతున్నామని పలువురు గ్రామసభ దృష్టికి తెచ్చారు. అద్దెకు ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు వారు నివాసం ఉండలేక నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇదిగో పూడ్చేస్తాం అదిగో పూడ్చేస్తాం అంటూ కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని సర్పంచిని ప్రశ్నించారు. జగనన్న ఇళ్ల స్థలాలు గ్రామానికి దూరంగా ఇస్తే ఇళ్లు ఎలా నిర్మించాలని లబ్దిదారులు ప్రశ్నించారు. ఇంటి నిర్మాణం చేపట్టకపోతే పట్టా రద్దు చేస్తామని హెచ్చరించడం అన్యాయమని సర్పంచిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి అభివృద్ధి పేరుతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి పైపులను ధ్వంసం చేసి దౌర్జన్యానికి దిగుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరితే కనీసం పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించలేని గ్రామసభలు వృథా అని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై సమాధానం చెప్పలేక సర్పంచి, అధికారులు మౌనంగా ఉండి పోయారు. దీంతో పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో జఠిలమైన సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచికి సూచించారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఛైర్మన్ కొల్లా కృష్ణ, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'బోదకాలు'కు ఆదిలోనే చికిత్స అందించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

బోధకాలు వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తించి సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాధి ముదిరితే చికిత్స లేదని డిప్యూటీ మేయర్, 35వ డివిజన్ కార్పొరేటర్ గుడిదేశి శ్రీనివాస్ సూచించారు. స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొత్తపేట పరిధిలోని 25వ సచివాలయంలో వైద్యాధికారి రోహిత్ ఆధ్వర్యంలో బోధకాలు వ్యాధిగ్రస్తులకు మార్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ బోదకాలును అశ్రద్ధ చేయొద్దని, ఎవరన్నా కాళ్ల వాపులు, జ్వరంతో బాధపడితే స్థానిక ఆరోగ్య కార్యకర్తలను, ఆశాలను సంప్రదించాలన్నారు. క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుందని, ఫైలేరియా పాములు మన రక్తంలో గుడ్లు పెట్టి పెరిగి గజ్జలు దగ్గర వాపు వచ్చి కాళ్లు, చేతులకు, రొమ్ములకు, హైడ్రోసిల్కు మొదలు భాగాల్లో బోదవ్యాధి రావొచ్చని చెప్పారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ దోమల ద్వారా అనేక రకాల వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ స్రవంతి, ఎఎన్ఎం జి.వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు, సచివాలయ అడ్మిన్ జి.మహేష్, ఆశా కార్యకర్తలు సిహెచ్.దేవి, పి.దేవి, అనురాధ, శివ పార్వతి, సుబ్రహ్మణ్యేశ్వరీ, మణి, సచివాల సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

రాగిజావతో ఆరోగ్యం

ప్రజాశక్తి - భీమడోలు

జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందజేస్తున్న రాగి జావని ప్రతిఒక్కరూ తీసుకోవాలని ఎంపిపి కనుమాల రామయ్య కోరారు. ఆగడాలలంక హైస్కూల్లో రాగిజావను విద్యార్థులు తాగేందుకు వీలుగా ప్రభుత్వం సరఫరా చేసిన స్టీలు గ్లాసులను గురువారం పంపిణీ చేశారు. అన్నేవారిగూడెం మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్లాసులను సర్పంచి నీలం శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేస్తున్నట్లు గ్రామీణ నీటి సరఫరా సంస్థ ఎఇ కె.రామారావు తెలిపారు. దీనిలో భాగంగా మండలంలోని అన్ని చెరువులను పూర్తిస్థాయిలో నింపినట్లు తెలిపారు. ఈ చెరువుల వల్ల 45 రోజుల పాటు ప్రజలకు తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. చెట్టున్నపాడు, కోరుకొల్లు, ఆగడాలలంక, ఇతర కొల్లేరులంక గ్రామాలకు తాగునీటి ఎద్దడి ఏర్పడినప్పటికీ సమస్య పరిష్కారానికి తాగునీటి రవాణాకు చర్యలు తీసుకున్నామన్నారు. దీనికి ప్రభుత్వం రూ.9.54 లక్షలు కేటాయించిందని తెలిపారు. పశువుల దాహార్తిని తీర్చేందుకు సూరప్పగూడెంలోని పశువుల తాగునీటి చెరువును బాగుచేసి నీటితో నింపామన్నారు. ఇదేవిధంగా భీమడోలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హైస్కూల్ సమీపంలోని తిమ్మన్నచెరువును బాగుచేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గుండుగొలను పంచాయతీ ఆధ్వర్యంలోని తాగునీటి చెరువు ఫిల్టర్ బాగుచేశామన్నారు. ఇదేవిధంగా భీమడోలు, గుండుగొలను కేంద్రాలుగా పనిచేస్తున్న తాగునీటి ప్రాజెక్టుల ఫిల్టర్ బెడ్ల మార్పు కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించామన్నారు. నిధులు రాగానే పనులను ప్రారంభిస్తామన్నారు. భీమడోలు, గుండుగొలను జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల కోసం అవసరమైన నీటి సరఫరా కోసం రూ.1.04 కోట్ల వ్యయంతో బోర్లు వేసి నీటి తరలింపు కార్యక్రమాలను చేపట్టామన్నారు. కానీ ఈ నీరు తాగేందుకు పనికిరాదని స్థానికులు ఆరోపిస్తున్న నేపథ్యంలో నీటి నాణ్యత పరీక్షల కోసం లేబొరేటరీకి పంపామన్నారు. ఇదే క్రమంలో ఆయా గ్రామ పంచాయతీల ద్వారా గోదావరి జలాలను తాగునీరుగా అందించేందుకు గుండుగొలనుకు రూ.1.90 కోట్లు అవసరమని ప్రతిపాదన పంపామన్నారు. భీమడోలులో ఇదే తరహాలో ఏర్పాటుకు రూ.60 లక్షలతో ప్రతిపాదన పంపామని చెప్పారు. దీనికి అదనంగా 90 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించామని గ్రామీణ నీటి సరఫరా సంస్థ సహాయ ఇంజినీర్ కె.రామారావు తెలిపారు.

ఇఫ్తార్ విందుకు ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ముదినేపల్లి

రంజాన్ మాసం సందర్భంగా ముదినేపల్లి మసీదులో గురువారం రాత్రి ముస్లిము సోదరులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు తనయులు దూలం వినయ్‌కుమార్, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, తహశీల్దార్ కె.శ్రీనివాస్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాభక్షు, వైసిపి శ్రేణులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

సిబ్బంది రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుదారులకు సక్రమంగా రేషన్‌బియ్యం పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. బియ్యం పంపిణీపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతినెల ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కె.శ్రీనివాస్, డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఎస్‌టిల్లో చేర్చడంపై స్పష్టత ఇవ్వండి

ఎంఎల్‌ఎను నిలదీసిన ఆదివాసీ జెఎసి నాయకులు

ప్రజాశక్తి - వేలేరుపాడు

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానంపై స్పష్టమైన వైఖరి చెప్పాలని ఆదివాసీలు ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజును డిమాండ్ చేశారు. ఆసరా పథకాన్ని ప్రారంభించడానికి వెళ్తున్న బాలరాజును వసంతవాడ గ్రామం వద్ద ఆదివాసి జెఎసి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. దీనిపై ఎంఎల్‌ఎ స్పందిస్తూ బోయ, వాల్మీకులను కలపడం వల్ల ఆదివాసీలకు అన్యాయం జరగదన్నారు. ఏ విధంగా అన్యాయం జరగదో చెప్పాలని జెఎసి నాయకులు డిమాండ్ చేయగా, అన్యాయం జరిగితే తన పదవిని త్యాగం చేస్తానని సమాధానం దాటవేశారు. గత సంవత్సరం గోదావరి వరదల కారణంగా కూలిపోయిన ఇళ్లకు పరిహారం అందలేదని ప్రశ్నించగా ఎంఎల్‌ఎ స్పందిస్తూ 90శాతం మందికి పరిహారం అందిందని చెప్పారు. దీనిపై ఆదివాసీలు ఇంతవరకూ కనీసం 30 శాతం మందికి కూడా అందలేదని ఎంఎల్‌ఎ నిలదీశారు. బోయ వాల్మీకుల తీర్మానానికి మద్దతుగా నిలుస్తున్న ఎంఎల్‌ఎ, ఎంపీ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అడవి బిడ్డలకు అన్యాయం చేస్తే రానున్న రోజుల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్ముల రమేష్, సీతారామయ్య, మోహన్‌రావు, ఊకె ముత్యాలరావు, పిట్టా వీరయ్య, కరటం గౌరీ శంకర్ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కులను తెల్లం బాలరాజు గురువారం అందించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నారన్నారు. మండలంలోని 204 స్వయం సహాయక సంఘాలకు రూ.62,58,307 ఆసరా లబ్ధి చేకూరిందన్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజలకు ఎంతో అండగా వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మీదేవి, జెడ్‌పిటిసి సభ్యులు గుజ్జ రామలక్ష్మి, వైస్‌ఎంపిపిలు కేశగాని వెంకటేశ్వరమ్మ, మేడవరపు నాగశ్రీ, వైసిపి మండల కన్వీనర్ కేశగాని శ్రీనివాస్ గౌడ్, నాయకులు కామినేని వెంకటేశ్వరరావు, సౌకత్, కె.సత్తిరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇల్లు కట్టుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు జగనన్న ఇళ్ల లబ్ధిదారులను చైతన్యపరచి త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఆడిట్ అధికారి ఎవిఆర్.గంగాధర్‌రావు సూచించారు. స్థానిక ఎంపిపి సమావేశ మందిరంలో గురువారం మండల స్థాయిలో స్పందన ఫిర్యాదుల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపిడిఒ రాఘవన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణాల కోసం చేపట్టిన వంద రోజుల కార్యాచరణ సత్ఫలితాలిస్తుందని తెలిపారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని 75 శాతం పూర్తి చేసిన మండలంగా భీమడోలు జిల్లాస్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. ఇదే క్రమంలో వందరోజుల వ్యవధిలో పునాది స్థాయి నుంచి శ్లాబు వేసే స్థాయి వరకూ 509 నిర్మాణాలు లక్ష్యం కాగా దీనిలో 19.20 శాతం మాత్రమే పూర్తి కావడం నిరాశకు గురి చేసిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులు గృహ నిర్మాణాలను తుదివరకూ పూర్తిచేసే లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందజేయాలని బాధ్యులను కోరారు. ఈ విషయమై పూళ్ల-1 సచివాలయం 50 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసుకుని మొదటిస్థానంలో ఉందని, కురెళ్లగూడెం కేవలం ఒక శాతం లక్ష్యాన్ని పూర్తి చేసి అట్టడుగున ఉందని తెలిపారు. గృహ నిర్మాణాలు చేపట్టలేని లబ్ధిదారులకు సహకరించేందుకు గృహ నిర్మాణ సంస్థ ద్వారా గుత్తేదారులను సమకూర్చుతున్నామని తెలిపారు. వీరికి గృహ నిర్మాణాల కోసం కేటాయించిన నిధులకు అదనంగా లబ్ధిదారుని కుటుంబంలోని డ్వాక్రా సభ్యుల పేర రూ.35 వేలు రుణాన్ని అందజేస్తున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై చేపట్టిన సమీక్షలో భాగంగా నాడు-నేడులో పాఠశాల భవనాల నిర్మాణాలకు రివాల్వింగ్ ఫండ్ అందుబాటులో ఉన్నప్పటికీ సిమెంట్ కొరత కారణంగా నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. ఇతర ప్రాధాన్యతా భవనాల నిర్మాణాల బిల్లులు కొన్ని పెండింగ్‌లో ఉన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇదే క్రమంలో కొందరు గుత్తేదారులు తమకు నిర్మాణాల కోసం కేటాయించిన మొత్తాన్ని పెంచాలని కోరుతున్నారని తెలిపారు. దీనిపై ఎంపిడిఒ మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల కోసం అవసరమైన నిధులు మండల పరిషత్ నిధుల నుంచి, గ్రామపంచాయతీ నిధుల నుంచి చెల్లించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. జగనన్న గోరుముద్ద, ఫ్యామిలీ ఫిజీషియన్, ఉపాధి హామీ పనుల ప్రగతిపై సమీక్షించారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. స్పందన ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా పథకం సహాయ ఇంజనీర్లు సతీష్, సత్యనారాయణ, రామారావు, వ్యవసాయాధికారి ఉషారాణి పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

టిడిపి అధినేత చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణ 15 కేజీల భారీకేక్ కట్‌చేశారు. అనంతరం చంటి మాట్లాడుతూ చంద్రబాబు ఒక విజన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేత కొక్కిరగడ్డ జయరాజు, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, ఏలూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉప్పాల జగదీష్‌బాబు, పెద్దిబోయిన శివప్రసాద్, నాయుడు సోమేష్, వందనాల శ్రీనివాస్‌రావు, నెరుసు గంగరాజు, పూజారి నిరంజన్, అచ్చాయమ్మా పాల్గొన్నారు.

ముదినేపల్లి : చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను మండలంలో టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ముదినేపల్లిలో పార్టీ యువనేత కె.వినోద్, టిడిపి మండల అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. మండలంలోని పెదపాలపర్రులో మహాఅన్నసమారాధన నిర్వహించారు. ఈ సమారాధనలో వాహనదారులు, బాటసారులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కమ్మిలి విఠల్‌రావు, బి.రవికుమార్, వి.నరసింహారావు, పి.విశ్వేశ్వరరావు, పి.ఏడుకొండలు, డాక్టర్ శ్రీనివాస్, కె.విఠల్, కె.శేషుబాబు, పి.పాండురంగారావు, జి.రాకేష్, వై.రాంబాబు, డి.సుధా, పి.సురేష్ పాల్గొన్నారు.

మండవల్లి: రాష్ట్రానికి దశ, దిశానిర్దేశకులు చంద్రబాబు మాత్రమేనని మాజీ ఎంఎల్‌సి కె.విఠల్‌రావు అన్నారు. చంద్రబాబు పుట్టినరోజు వేడుక టిడిపి మండల అధ్యక్షులు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు ఆధ్వర్యంలో మండవల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబును సిఎం చేసే వరకూ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. అనంతరం కొడాలి వినోద్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, చాబత్తుల విజయ్, ముళ్లపూడి సత్తిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని తుక్కులూరు జెబిఎల్ హోమ్‌లో వృద్ధులకు నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నదానం చేశారు. కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముసునూరు రాజా, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, బిసి సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి తలపట్టి రాజశేఖర్, అన్నే సురేష్, యనమదల సత్యనారాయణ, పాదం సత్యనారాయణ, వెలగపూడి సాయి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం: చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను గురువారం మండలంలోని రాజుపోతేపల్లి, అప్పలరాజుగూడెంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజుపోతేపల్లి సెంటర్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పోలవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కేన్సర్‌తో బాధపడుతున్న టిడిపి కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. అప్పలరాజుగూడెంలో టిడిపి తెలుగు యువత నియోజకవర్గ నాయకులు గన్నిన సురేంద్ర ఆధ్వర్యంలో కేకు కట్ చేసి స్థానిక మసీదు వద్ద రంజాన్ సందర్భంగా 27 మంది ముస్లిము కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు.

చాట్రాయి : చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకుని చాట్రాయిలో వేడుకలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కేకు కట్ చేసి, చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, మండల అధ్యక్షులు మరిడి వెంకటేశ్వరరావు(చిట్టిబాబు), నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు: టిడిపి అధినేత చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు పార్టీ నేతలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ముసునూరులో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, మండల అధ్యక్షులు దేవినేని బలరామ్, మండల నాయకులు పాకనాటి సీతారామ్, కొండేటి విజయలక్ష్మి, బాబి, తోట శ్రీనివాసరావు, పాకనాటి వీరాంజనేయులు, హరిబాబు, తుమ్మల మధులత, రెడ్డికృష్ణ, గారపాటి నరసింహారావు, నక్కా యోహాన్, నల్లిబోయిన రాంబాబు పాల్గొన్నారు. కాట్రేనిపాడులో గద్దల సుహాసిని, మోహన్‌రావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, సూర్యదేవర నాగమంజుల, శ్రీనివాసరావు, ఫణీ, ఇస్సాక్, వలసపల్లిలో మేదరమెట్ల సురేంద్ర, గుడిపాడులో కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు, మసిముక్కు సుబ్బారావు, చెక్కపల్లిలో తల్లిబోయిన సత్యనారాయణ, రాధిక, కాటేపల్లి సత్యనారాయణ, నాగేశ్వరరావు, అక్కిరెడ్డిగూడెంలో పి.లక్ష్మీ, సత్యనారాయణ, రమణక్కపేటలో బాబీ, వంశీ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



నూజివీడు రూరల్ : రావిచర్ల, కొత్తూరు, రామన్నగూడెం, అన్నవరం తదితర గ్రామాల్లో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి సర్పంచి కాపా శ్రీనివాసరావు, లావు మురళీమోహన్, ఉప సర్పంచి ముల్లంగి మోషే, కొణతం కిషోర్, నాగబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

చింతలపూడి : ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

నూజివీడు : చంద్రబాబు పుట్టినరోజు వేడుకను నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా అట్లూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర ఏర్పాటు చేసిన కేకును ముద్దరబోయిన కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ముసునూరు రాజా, నాయకులు వేణుగోపాలరావు, పసుపులేటి జగన్, మలిశెట్టి జగదీష్, జగ్గవరపు వెంకటరెడ్డి, సంగీతరావు, పల్లి నాగరాజు పాల్గొన్నారు.

కలిదిండి : చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా స్థానిక నాని బంక్ వద్ద కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నున్న రమాదేవి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి లంకా రత్నారావు, ఎస్ఆర్‌పి అగ్రహారం సర్పంచి పరసా వెంకటస్వామి, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కురేళ్ల ఏడుకొండలు, ఉపాధ్యక్షులు బళ్ల రాజు, మాజీ సర్పంచి వాకాని కోటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, నున్న సుబ్రమణ్యం పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు రావు కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు, అనంతరం ఆసుపత్రి సత్యసాయి అన్నదాన ఆశ్రమంలో రోగులకు, సిబ్బందికి, భోజనం సదుపాయం ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని పేరంపేటలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పార్టీ మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలవరం : చంద్రబాబు పుట్టినరోజును టిడిపి నాయకులు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎల్ఎన్‌డి, గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ, ప్రగడపల్లి, వింజరం, చేగొండపల్లిలో టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పట్టిసీమ పంచాయతీ బంగారమ్మపేటలో పోలవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాస్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

పవన్‌తోనే అవినీతి రహిత పాలన

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్రంలో అవినీతిరహిత పరిపాలించే సమర్థత పవన్ కళ్యాణ్‌కు మాత్రమే ఉందని ఆ పార్టీ ఉంగుటూరు నియోజవర్గ ఇన్‌ఛార్జి ధర్మరాజు పేర్కొన్నారు. గురువారం జనంలోకి జనసేన కార్యక్రమం తల్లాపురంలో నిర్వహించారు. ధర్మరాజు మాట్లాడుతూ ఒకసారి పవన్‌కు అవకాశం ఇవ్వాలని, జనసేన సిద్ధాంతాలు, ఆశయాలను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండుగల శ్రీనివాసరావు, పుల్ల శ్రీనివాసరావు, గగ్గల విజయేంద్ర కుమార్, బసవ సతీష్, ఆకుల మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం

కాళ్ళకూరు గ్రామం, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా. ఫోన్: 08816-245341, సెల్: 89852 44445

షార్ట్ సీల్డు టెండర్ ప్రకటన

ఆర్.సి.సంఖ్య: 10/2023 తేదీ: 20-04-2023

శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, కాళ్ళకూరు వార్కి ఈ క్రింది తెల్పిన ఐటమ్స్‌నకు సీల్డు టెండర్ ద్వారా కోరబడుచున్నవి.

వ.నెం	వివరములు	టెండరు స్వభావం	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము రూ.	టెండరు షెడ్యూల్ ఖరీదు రూ.	టెండరు షెడ్యూలు జారీ చేయు తేదీ	టెండరు దాఖలు చేయుటకు ఆఖరు తేదీ సమయం	టెండరు తెరచు తేదీ సమయం
1	కళ్యాణోత్సవములు సందర్భంగా కళ్యాణం వద్ద విద్యుత్ మెరుపులు ప్రదర్శన (లేజర్ షో)	సీల్డు టెండరు	ది.01-05-2023 తేదీ రాత్రి గం.7:00లకు విద్యుత్ మెరుపుల ప్రదర్శన	1000/-	100/-	21-04-23 నుండి	28-04-23 ఉదయం 10:00 గం॥ల వరకు	28-04-23 ఉదయం 10:30 గం॥ల వరకు
2	కళ్యాణోత్సవములు సందర్భంగా రథోత్సవంలో విద్యుత్ మెరుపులు ప్రదర్శన (లేజర్ షో)	సీల్డు టెండరు	ది.05-05-2023 తేదీ రాత్రి గం.5:00లకు విద్యుత్ మెరుపుల ప్రదర్శన	1000/-	100/-	21-04-23 నుండి	28-04-23 ఉదయం 10:00 గం॥ల వరకు	28-04-23 ఉదయం 10:30 గం॥ల వరకు

ఇతర వివరములకు దేవాలయ కార్యాలయం పని వేళల యందు సంప్రదించగలరు.
కాళ్ళకూరు,
ది.20-04-2023.
శ్రీ స్వామి వారి సేవలో
ఛైర్మన్ /ధర్మకర్తల మండలి, కార్యనిర్వహణాధికారి

రెడ్ క్రాస్ ఆధ్వర్యాన చలివేంద్రం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు గురువారం ప్రారంభించారు. నిత్యం బాటసారులతో రద్దీగా ఉండే జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి మెయిన్ గేట్ సమీపంలో రెడ్ క్రాస్ మెడికల్ షాప్ ఎదురుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్న రెడ్ క్రాస్ సంస్థను మేయర్ నూర్జహాన్ పెదబాబు దంపతులు అభినందించారు. ఎండలు పెరుగుతున్న కారణంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, సెక్రటరీ బిన్నీ, నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రైతు భరోసాకు అర్హతున్నవారు ఈ నెలాఖరులోగా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి హరికిరణ్ సూచించారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి వారి ఖాతాలో మే నెలలో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందని తెలిపారు.

రాయితీపై వ్యవసాయ యంత్రాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతు సంఘాలకు 40శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రభుత్వం అందిస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి డి.ముత్యాలరావు గురువారం తెలిపారు. యంత్రపరికరాలు కావాల్సిన రైతులు ఐదుగురు కలిసి గ్రూపుగా ఏర్పడి గ్రామంలో వ్యవసాయానికి అవసరమైన యంత్ర పరికరాలు సుమారు రూ.15 లక్షల వరకూ రాయితీపై ప్రభుత్వం అందిస్తుందని, రైతులు ముందుగా 50 శాతం వాటాగా చెల్లించాలని తెలిపారు. బ్యాంకు రుణం 50 శాతం అందిస్తుందని, అనంతరం ప్రభుత్వం 40శాతం నేరుగా ఖాతాలో జమచేస్తుందన్నారు. రైతు సంఘాలకు కిసాన్ పథకం ద్వారా ట్రాక్టర్లు, డ్రోన్‌లు, డిస్కులు, కల్టివేటర్, స్ప్రేయర్లు, రోటోవేటర్, ట్రక్కులు, గడ్డిచుట్టే యంత్రాలు రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. కావాల్సిన రైతులు సంప్రదించాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పోలవరం

గత ఖరీఫ్ సీజన్లో వచ్చిన ఇబ్బందులను అధిగమించి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగించకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని తహశీల్దార్ బి.సుమతి ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి కొనుగోలుపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పోలవరం-1, 2, గూటాల, కొత్త పట్టిసీమలో నాలుగు ధాన్యం కొనుగోల కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నాణ్యతా ప్రమాణాల పరీక్ష, గోనె సంచులు, తదితర సామగ్రిని ఏర్పాటు చేసుకోవాలని సొసైటీ సెక్రటరీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సుమతి, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు, సలహా మండలి ఛైర్మన్ దత్తు రాంబాబు, సివిల్ సప్లయీస్ డిటి రైతు భరోసా కేంద్రం సిబ్బంది, సొసైటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) పోయినది

MYLA AMMANNA అను నాకు KUWAIT రాయభార కార్యాలయం అధికారులు ది. 28-07-2019న **X0829747** నెంబరు గల ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. సదరు EC జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు మా ఇంటి నుండి నరసాపురం పట్టణం వెళుతున్న సమయంలో నా ఒరిజినల్ EC పోయినది. గాన, నా ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (EC) ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

MYLA AMMANNA
S/o. Myla Vanama Raju
D.No. 5-16, Chinamainavani Lanka
Vemuladeevi, West Post
Narasapuram Mandal, W.G.Dt., A.P.,

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 702/2022
in I.A.No. 703/2022
in I.A.No. 704/2022
in O.S.No. 47/2014

Between:
Sri Lakkakula Satyanarayana (Died) and others ***...Petitioners /Plaintiffs***
AND
Sri Lakkakula Suryachandra Rao and others ***...Respondents /Defendants***
Sri Lakkakula Durga Prasad
Smt Moghala Neelima
...Respondents /Proposed Parties at 10 and 11 Defendants

Respondents /Proposed Parties at 10 and 11 Defendants

10th Respondent /10th Defendant:
Sri Lakkakula Durga Prasad, S/o. Jagadeeswara Narayana, 30 Yrs, Hindu, Male, Private Employee, Madhavaram, Tadepalliguedm Mandal, TPG SCJC.

11th Respondent /11th Defendant:
Smt. Moghala Neelima, W/o. Chandra sekhar, D/o. Jagadeeswara Narayana, 25 Years, Hindu, Female, HouseWife, Gurralavari Street, Co-Operative Bank, Penugonda, Tanuku SCJC.

పై నెంబరు పిటీషనులో /దావాలో మీపై పిటీషనర్ను /వాదులు పిటీషను /దావా దాఖలు చేసిన దర్మిలా 2వ రెస్పాండెంటు /2వ ప్రతివాది చనిపోయిన దర్మిలా 10, 11 రెస్పాండెంట్లు /ప్రతివాదులు అయిన మిమ్మల్ని వారసులు /పార్టీలుగా చేర్చమని కోరుచూ మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించి యున్నప్పటికి మీరు తీసుకొనని కారణముగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులు అమలు నిమిత్తం వాయిదా వేసియున్నారు. వాయిదా తేదీ **ది.24-04-2023 వ సం॥రం తేదీ అయి ఉన్నది. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను.** లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానం చెయ్యబడును.

వాయిదా తేదీ: 24-04-2023

ముద్దన శ్రీనివాసరావు
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 99483 37320